క్లుప్తంగా

నియామకం

కలికిరి (వాల్మీకిపురం): వాల్మీకిపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం సత్యసాయి జిల్లా డీఎంహెచ్ఓగా పదోన్నతిపై వెళ్లారు. ఆ స్థానంలో ఇక్కడే విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవికుమార్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంటల బీమా ప్రీమియంతో ప్రయోజనం

కలికిరి(వాల్మీకిపురం): వరి, టమాటా, మామిడి తదితర పంటలు సాగు చేసిన రైతులకు పంటల బీమా ప్రీమియంతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని చింతపర్తి-1 రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అలాగే ఈ-కేవైసీ చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలులోవున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఏడీఏ వాణిశ్రీ, ఏఓ హేమలత, ఆర్ఎస్‌కేల సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండండి

బి.కొత్తకోట: నేరాలపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేసుల పురోగతి, అరెస్టులు, నాన్ బెయిలబుల్ వారెంట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సీఐ జీవన్ గంగనాద్ బాబు, సిబ్బందితో సమావేశమయ్యారు. పిల్లలు, మహిళలపై జరిగే అకృత్యాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇళ్లలో చోరీలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మత్తు పదార్థాల విక్రయంపై నిఘా పెంచాలని అనుమానితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. 47 షెడ్లు మంజూరు కాగా అన్ని పనులు ప్రారంభించినా మూడు పూర్తయ్యాయని, 15 రూఫ్‌లెవల్‌కు వచ్చాయని తెలిపారు. అన్ని త్వరగా పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. ఉపాధి కూలీలు కోరిన వెంటనే పనులు చూపి కూలీలు పనుల్లో పాల్గొనే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా డీబీటీ మేనేజర్ మహేంద్రమణి, ఏపీఓ అంజప్ప పాల్గొన్నారు.

దళితుల అనుభవంలో ఉన్న స్థలాలు వారికే కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

ములకలచెరువు: దళితుల అనుభవంలో ఉన్న స్థలాలు దళితులకే కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు యం. హరినాథ్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని సెంట్రల్‌స్కూల్ పంచాయతీ పెద్దమొరవపల్లెకు చెందిన రమణప్ప సర్వే నంబర్లు 382, 383కు చెందిన రెండు కుంటల స్థలం గత 30 ఏళ్లుగా వారి ఆధీనంలో ఉందని తెలిపారు. వేరే వారు ఈ స్థలాన్ని ఆక్రమణ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై డీటీ లక్ష్మికి వినతి పత్రం అందజేశామన్నారు. అధికారులు న్యాయం చేయాలని వారు కోరారు.

తైక్వాండో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

ములకలచెరువు: స్థానిక కస్తూర్బా పాఠశాల బాలికలు తైక్వాండో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పీడీ రేష్మా మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలకు చెందిన అండర్ -17 విభాగంలో రేఖా, ఐశ్వర్య, రాధ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. అక్కడి గెలుపొందాక జనవరి నెలలో సింగపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఎస్ఓ శిల్పా, తోటి బాలికలు అభినందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పీలేరు : తిరుపతిలో ఈ నెల 27, 28న నిర్వహించనున్న బంజార జన్ సంఘ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను మంగళవారం నగిరిపల్లెలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మూడే హరి చౌహాన్ నాయక్ కోరారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



బెంగళూరు రోడ్డులోని ఆరోగ్యమాత చర్చి



తిరుపతి రోడ్డులోని సెయింట్‌లూక్ చర్చి

- జేసీఎం చర్చి... చరిత్రకు సాక్షి
- జిల్లాలో ప్రత్యేక స్థానం
- చెక్కుచెదరని నిర్మాణం
- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

మదనపల్లె సిటీ: క్రిస్మస్‌కు మదనపల్లెలోని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. ఆధునిక హంగులతో విద్యుత్‌దీపాలంకరణలో మెరిసిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా చెక్కుచెదరకుండా క్రైస్తవుల ప్రార్థనలకు వేదికలుగా నిలుసున్నాయి. ఇందులో జేసీఎం చర్చికి ఎంతో చరిత్ర ఉంది.

121 ఏళ్ల చరిత్ర

మదనపల్లె పట్టణంలో 121 ఏళ్ల చరిత్ర కలిగిన జేసీఎం చర్చికి ఎంతో చరిత్ర ఉంది. ఏళ్ల తరబడిగా ఆధునిక నిర్మాణాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. చారిత్రక కట్టడాలలో జేసీఎం చర్చి ఒకటి. ఇది మదనపల్లె కీర్తి ప్రతిష్టలకు ప్రతీకగా పేరొందింది. భారతదేశంలో క్రైస్తవ మత ప్రచారం, వైద్య సేవలందించేందుకు వచ్చిన అమెరికాకు చెందిన దొర డాక్టర్ జాకబ్ చాంబర్లీన్ 1903లో ప్రార్థనల కోసం చర్చిని నిర్మించాలని నిర్ణయించారు. మిత్రులు టీ.సుబ్బారెడ్డి, మురుగేశ మొదలియార్ల నుంచి స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని కొని, 1905లో నిర్మాణం పూర్తి చేసి, క్రీస్తు సేవలకు అంకితం చేశారు. జేసీఎం చర్చిలో మదనపల్లెకు చెందిన క్రైస్తవులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ప్రతి ఆదివారం జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. 121 ఏళ్లుగా జేసీఎం చర్చిలో ప్రతి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, క్రిస్‌మస్ వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి వెయ్యి మందికిపైగా చర్చిలో ప్రార్థనలు చేసుకునే విశాలమైన స్థలాన్ని కలిగి ఉండటం జేసీఎం చర్చి ప్రత్యేకత. క్రిస్మస్, ఇతర ముఖ్య పండుగల సమయాల్లో లోపల, బయట సుమారు 2 వేల మంది వరకు ప్రార్థనలు చేసే అవకాశం ఉంది. క్రైస్తవ మతానికి సంబంధించిన సాహిత్యం, మత గ్రంథాలతో లైబ్రరీ చర్చిలో అందుబాటులో ఉంది. ఈ చర్చి నేటికి చెక్కు చెదరకుండా దృఢంగా నిలిచి ఉంది.

విద్యుత్‌వెలుగుల్లో చర్చిలు

క్రిస్మస్ పురస్కరించుకుని చర్చిని రంగు రంగు విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్చి ముందు పెద్ద స్టార్‌ను ఏర్పాటు చేశారు. చర్చి ఆవరణంలో ప్రత్యేక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. పెద్ద నక్షత్రంకు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. 25 అడుగుల క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక ఆరాధనలు

క్రిస్మస్‌పండుగ పురస్కరించుకుని చర్చిలో 25న (బుధవారం) ఉదయం 10 గంటలకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరుగుతుందని డివిజన్ సంఘ కాపరి రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ తెలిపారు. క్రైస్తవులు ఆరాధనల్లోపాల్గొనాలని కోరారు.

సెయింట్ లూక్ చర్చి

ఆరోగ్యవరం వద్దనున్న సెయింట్‌లూక్ చర్చి ఉంది. ఇది చాలా పురాతనమైనది. క్రిస్మస్‌కు చర్చిని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దీంతో పాటు ఏఎంసీలోని చర్చి క్రిస్మస్‌కు అన్ని ఏర్పాటు చేశారు. గుడిసివారిపల్లె చర్చిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఎంఎల్ఎల్ ఆస్పత్రి ఆవరణంలోని చర్చి, ఈస్టుపేటలోని చర్చి, బెంగళూరు రోడ్డులోని ఆరోగ్యమాత చర్చిలు క్రిస్మస్‌కు ప్రత్యేకంగా అలంకరించారు.

57 ఏళ్లు పూర్తి చేసుకున్న స్టీన్ పాల్స్ చర్చి

పీలేరురూరల్ : పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న స్టీన్ పాల్స్ చర్చి 57 సంవత్సరాలు పూర్తి చేసుకుని క్రిస్టమస్ వేడుకలకు ముస్తాబైంది. 1967 ఏప్రిల్ 16న స్టీన్ పాల్స్ చర్చిని అప్పటి బ్రిటీస్ దొర జె.ఎల్ మేయర్ నిర్మించడం జరిగింది. పీలేరులో పురాతన చర్చిగా పేరొందిన స్టీన్ పాల్స్ చర్చిలో క్రైస్తవులు అధిక సంఖ్యలో ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా క్రిస్టమస్ వేడుకలకు చర్చిని సిద్ధంగా చేశారు. అలాగే పీలేరు పట్టణంలో 15 చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి.

ఎంఐజీ లేఅవుట్ ప్రతిపాదిత స్థలం పరిశీలన



ఎంఐజీ లేఅవుట్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మధ్య తరగతి ఆదాయ ప్రజలకు సొంతింటి కల సాకారం చేసేందుకు గత ప్రభుత్వంలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ పథకంలో భాగంగా పీకేఎం-ఉడా ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఎంఐజీ లేఅవుట్ స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్ ఆదర్శరాజేంద్రన్ పరిశీలించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి మండలంలోని పోతబోలు జగనన్న కాలనీకి ఆనుకుని ప్రతిపాదించిన ఎంఐజీ లేఅవుట్ స్థలాన్ని సందర్శించారు. స్థలంలో విద్యుత్ హైటెన్షన్ లైన్లు వెళుతుండటాన్ని గమనించారు. దీంతో ప్రత్యామ్నాయంగా ఇంకెక్కడైనా 10 ఎకరాలు స్థలం ఎంపికచేయాలన్నారు. లేఅవుట్‌కు దక్షిణం వైపున బసినికొండ పంచాయతీలో స్థలం ఉందని రెవెన్యూ అధికారులు చెప్పడంతో సాధ్యాసాధ్యాలు పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. తర్వాత మదనపల్లె బైపాస్ రోడ్డు సిరికల్చర్ కాలనీలో యూనిట్ల ఏర్పాటుకు 11 మందికి స్థలాల కేటాయింపుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, టీపీఓ జకీరా, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

చెరువులకు కృష్ణా జలాలు తరలించేలా ప్రణాళిక

- కాలువపై రాకపోకల కోసం బ్రిడ్జిలు నిర్మించాలి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలు తరలించేలా పుంగనూరు ఉపకాలువ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. మంగళవారం ఆయన బి.కొత్తకోటలోని పప్పు హరీష్‌రెడ్డి ఇంటిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం, ప్రజల సమస్యలపై సమీక్షించారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ మిగిలిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు హంద్రీనీవా కాలువకు ఇటుఅటు ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ కాలువపై ప్రజలేకాక రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. దీనికోసం కాలువపై ప్రజలకు అవసరమైన చోట బ్రిడ్జి లేదా కల్వర్టులు నిర్మించి వెసులుబాటు కల్పించాల్సి ఉందన్నారు. అలాగే కరువు ప్రాంతమైన తంబళ్లపల్లెలోని చెరువులకు కృష్ణా జలాలను తరలించి నింపేలా గత ప్రభుత్వంలో ప్రణాళిక అమలు చేశామని చెప్పారు. పుంగనూరు ఉపకాలువ నుంచి చెరువులకు నీళ్లు తరలించేలా ఆఫ్‌టెక్ పాయింట్లు, తూములను ఏర్పాటు చేయించామని చెప్పారు. తూములను ఏర్పాటు చేయడం ద్వారా చెరువులకు ఇబ్బంది లేకుండా నీటి తరలింపు జరిగి రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పప్పు రాజారెడ్డి, సర్పంచు సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, దాదం లోకనాధరెడ్డి, శెట్టిపల్లె రమేష్‌రెడ్డి, బయ్యారెడ్డి, సాయి, మహేష్, బసిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 27న పోరుబాట



పోరుబాట పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు



వాల్మీకిపురంలో పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె : కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పేరుతో పోస్టర్‌లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...చంద్రబాబు పాలనను ఎండగట్టారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల పెంపు ఉండదని ప్రజలను నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో 3 సార్లు కరెంట్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరగ్గొట్టాడన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆరునెలల్లోనే ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం మోపారన్నారు. అలాగే పెద్ద ఎత్తున విద్యుత్ చార్జీలను పెంచేందుకు సిద్ధమయ్యారన్నారు. గతంలో వైయస్.జగన్ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన 200 వందల యూనిట్ల ఉచిత విద్యుత్‌కు మంగళం పాడటమే కాకుండా ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లు తొలగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయితే... రైతులు అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరుచేసే పరిస్థితి ఉండేదన్నారు. చంద్రబాబు పాలనలో పెరుగుతున్న కరెంటు చార్జీలతో నీరుగట్టువారిపల్లె చేనేత పరిశ్రమ కుదేలైపోతోందన్నారు. చంద్రబాబు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు సరైన గుణపాఠాలు నేర్పేందుకు ఈనెల 27న మదనపల్లె విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, చరణ్, వేణు, మల్లికార్జునరెడ్డి, జబ్బార్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరి (వాల్మీకిపురం): ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్, సర్పంచ్‌లు మునిభాస్కర్, రాజారెడ్డి, జయచంద్ర, కో-ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు ఆనంద్, రవి, చికెన్ మస్తాన్, సైపుల్లా, మదన్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, రఘు, రాజాబాబు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో ఎలాంటి విభేదాలు లేవు

– మండల తహసీల్దార్ ఖాజాబీ



మదనపల్లె : 'ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు. అడ్మినిస్ట్రేషన్‌కు ఇబ్బంది పెట్టవద్దు. మా ఉద్యోగాలు మమ్మల్ని చేసుకోనివ్వండంటూ' తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...పేపర్లలో ఏవేవో రాస్తుంటారని, ప్రతి దాన్ని తాను ఖండించాలన్నా, స్పందించాలన్నా కుదరదన్నారు. ఎమ్మెల్యేకు తాను ఒక రూపాయి ఇవ్వలేదని, ఆయన ఎప్పుడూ డబ్బులు అడిగింది లేదన్నారు. ప్రజానాయకుడిగా, ఎమ్మెల్యేగా ఆయన పిలిస్తే అధికారిగా వెళ్లాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినప్పుడు, అధికారులుగా మమ్మల్ని అడిగితే చేయగలిగినవి ఉంటే చేస్తామన్నారు. చేయలేని పక్షంలో చేయలేమని చెబుతాం తప్పితే ఏ విధంగానూ విభేదాలు లేవన్నారు. అసత్య ఆరోపణలు ఇకపై వస్తే వారిపై డిఫర్మేషన్ వేసేందుకు వెనుకాడనన్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులకు ఎమ్మెల్యే వస్తున్నారని, తాను వెళుతున్నానన్నారు.

పేస్ సంస్థ డైరెక్టర్ వీఎస్ రెడ్డికి అవార్డు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న వీఎస్‌రెడ్డి

మదనపల్లె సిటీ: వినియోగదారులకు చైతన్యం కలిగించేందుకు ఉత్తమ సేవలు అందించినందుకు మదనపల్లెకు చెందిన పేస్ సంస్థ డైరెక్టర్ వీఎస్ రెడ్డి ఉత్తమ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం విజయవాడలో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గత 20 సంవత్సరాలుగా వినియోగదారులను చైతన్యవ కలిగించే కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డు ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు.

‘కులదహనం’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బాస్ నాయకులు

మదనపల్లె : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 29న మదనపల్లెలో నిర్వహిస్తున్న ×కుల దహనం× కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో రాష్ట్ర నేతల సమావేశం నిర్వహించారు. బాస్ రాష్ట్ర కన్వీనర్ ఉలగనాధన్ గణపతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి వ్యవస్థాపకులు పీటీయం శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యను వ్యూహాత్మకంగా జఠిలం చేసి, అంబేడ్కర్ కుల నిర్మూలనా ఉద్యమాన్ని బీజేపీ తిరోగమనం వైపుకు మళ్లించిందన్నారు. ఈకుట్ర అర్థం చేసుకోలేక మాల – మాదిగలు ఒకరిపై మరొకరు కత్తులు నూరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాస్ శ్రేణులతోపాటు, కుల నిర్మూలనను కోరుకొనే వారందరూ ఈసభకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతబోలు రెడ్డెప్ప, రాష్ట్ర కార్యదర్శులు కె.వి. రమణ, పల్లం తాతయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు వి. దొరస్వామి, నీరుగట్టి రమణ, చిత్తూరు జిల్లా కో కన్వీనర్ వినోద్ కుమార్, అన్నమయ్య జిల్లా నాయకులు చాట్ల బయన్న, పి. రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

మండల మీట్‌పై అధికార కక్ష

- హైకోర్టు ఆదేశాలతో నిర్వహించిన సమావేశంపై నిర్లక్ష్యం
- రెవెన్యూ సహా ముఖ్య అధికారుల డుమ్మా



మాట్లాడుతున్న ఎంపీపీ మొహమూద్

బి.కొత్తకోట: ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి నిర్ణయాలకు వేదికైన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. మండల మీట్ నిర్వహణ విషయంలో కూటమి శ్రేణులు అడ్డుకొంటూ రావడంతో ఎంపీపీ మొహమూద్ హైకోర్టును ఆశ్రయించగా వారంలోగా నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మండలమీట్ ఏర్పాటు చేశారు. మొత్తం 15 మంది ఎంపీటీసీల్లో 12 మంది హాజరయ్యారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్ణయించిన సమయానికి సమావేశం మొదలైంది. సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వ శాఖల వారీగా అభివృద్ధిపై నివేదించి వివరించాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ కోరారు. శాఖల వారీగా అధికారులను వేదికపైకి పిలవగా అధికారులు డుమ్మా కొట్టడం బయట పడింది. మండల స్థాయిలో అన్ని ప్రభుత్వశాఖల అధికారులు మండలమీట్‌కు హాజరవ్వాల్సి ఉండగా ముఖ్యశాఖల అధికారులైన తహసీల్దార్, వ్యవసాయం, విద్య, సహకార, ఉద్యానవన, రహదారి భవనాలు, జలవనరుల శాఖ, ఇలా ఇతరా శాఖలకు చెందిన అధికారులు మండలమీట్ వైపు కన్నెత్తి చూడలేదు. హాజరైన వారిలో డిస్కం తరపున ఓ ఉద్యోగి, వెలుగు తరపున ఓ సీసీ, ఏపీఓ, హౌసింగ్ ఏఈ హాజరై తమశాఖలకు సంబంధించి మొక్కుబడిగా వివరాలు వెల్లడించారు. జెడ్పీటీసీ శివన్న, వైస్‌ఎంపీపీలు కృష్ణవేణి, సుధారాణి, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు.

వాళ్లకు నోటీసులు ఇవ్వండి

మండలమీట్‌కు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీపీ మొహమూద్ ఎంపీడీఓను ఆదేశించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలమీట్‌పై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై నోటీసులు జారీచేసి సంజాయిషీ కోరాలన్నారు. అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సమస్యల పరిష్కారం విషయంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



బాల్యవివాహాల నివారణపై ప్రతిజ్ఞ

రామసముద్రం : ప్రతి ఒక్కరు సమష్టిగా బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీడీపీఓ సుజాత తెలిపారు. మంగళవారం మండలం కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు మహిళా పోలీసులు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు హాజరయ్యారు. సీడీపీఓ సుజాత మాట్లాడుతూ బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రుతుక్రమం, పరిశుభ్రత, పోక్సో చట్టం ఆత్మ రక్షణ, వత్తి విద్య జీవనోపాధి అవకాశాలు, లింగ వివక్షతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని బడిలో చేర్పించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హిమాచలపతి, ఈఓఆర్డీ సుధాకర్, మెడికల్ ఆఫీసర్ లీలా, సూపర్ వైజర్ చంద్రకాంత తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా కోరారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పన్నులు వసూలు చేసి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని సూచించారు. అనంతరం క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని చర్చిలకు, మసీదులకు, దేవాలయాలకు బ్లీచింగ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు శ్రీనాథరెడ్డి, సచిన్, పిక్కా రమణ, ఆబీద్, పరమేష్, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

రామసముద్రం : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం రామసముద్రం మండలం మూగవాడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వివిధ సమస్యపై 11అర్జీలు వచ్చాయని త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ వసీంఅక్రమ్, వీఆర్ఓ రఘు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఎండోమెంట్ అధికారులు

మదనపల్లె : మదనపల్లె మండలం కమ్మపల్లె గ్రామానికి సంబంధించి పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డులోని గ్రామసచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో దేవదాయశాఖ తరఫున అధికారి హాజరైనట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఓ పత్రికా ప్రకటనలో... ఈనెల 18న జరిగిన రెవెన్యూ సదస్సుకు దేవదాయశాఖ తరపున మండల కోఆర్డినేటర్ బి.సి.బాలఅంకన్న హాజరయ్యారన్నారు. మండలంలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ప్రకారం దేవదాయశాఖ అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

భూ హక్కుదారులకు సత్వర న్యాయం

నిమ్మనపల్లె : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ హక్కుదారులకు సత్వర న్యాయం జరుగుతుందని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. మంగళవారం నిమ్మనపల్లెలోని వారపుసంతలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనుంజయులు మాట్లాడుతూ నిషేధిత జాబితాలోని భూములను కొనడం, అమ్మడం నేరం అన్నారు. భూములకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్ లైన్ లో ఎప్పటికప్పుడు పొందుపరిచి, రసీదులు ఇస్తున్నామన్నారు. సదస్సుల ద్వారా 49 రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు.

పెద్దమండ్యం: భూమి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ కంటి విశ్వనాధరెడ్డి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, వైస్ ఎంపీపీ శారదమ్మ, ఆర్ఐ రమేష్, వీఏఆర్వో ఆంజినేయులు నాయక్, మాజీ సర్పంచ్ నాగార్జున పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. ఇందులో 12 అర్జీలు రెవెన్యూ సమస్యలు కాగా మిగిలిన 13 అర్జీలు ఇతర శాఖలకు సంబంధించి రావడంతో సదరు ప్రజలకు రశీదులు అందజేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

గుర్రంకొండ: భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. మంగళవారం మండలంలోని సరిమడుగు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ప్రత్యేకాధికారి, స్పెషల డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా అన్నారు. మంగళవారం మండలంలోని ముదుపులవేముల తానావడ్డిపల్లెలో రైతు సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతు సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 90 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లోపు అర్జీలు పరిష్కరించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ కార్యవర్గ ఎన్నిక

మదనపల్లె : టమాటా మార్కెట్‌యార్డు టీఎన్‌టీయూసీ కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. మార్కెట్‌యార్డులోని ఎస్‌టీఎం టమాటా మండీలో జరిగిన టీఎన్‌టీయూసీ, కర్నూల్(రిజిస్టర్‌నెం.1550) సర్వసభ్య సమావేశంలో మేస్త్రీలు, హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా సభ్యుల సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం తరపున టమాటా మండీ హమాలీలను 4వతరగతి ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో .. ఎం.డి.గౌస్‌ను గౌరవాధ్యక్షులుగా, ఎం.నాగయ్యను సలహాదారుడిగా, ప్రెసిడెంట్‌గా వి.ఖాసీం, ప్రధాన కార్యదర్శిగా షామీర్ రెహమాన్, ఉపాధ్యక్షులుగా రామయ్య, హమీద్ బాషా, కార్యదర్శిగా షబ్బీర్, కోశాధికారిగా ఖుర్షీద్ రెహమాన్, ఉప కార్యదర్శులుగా ఎస్.బావాజాన్, ఆసీఫ్, సాదిక్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎస్‌జీ కళాశాల విద్యార్థులకు నగదు బహుమతి

పీలేరు రూరల్ : జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో విద్యార్థులకు వర్చువల్ హియరింగ్ అండ్ డిజిటల్ యాక్సెస్ టు కన్సుమర్ జస్టిస్ అంశంపై వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం రాయచోటిలో ఆర్‌డీవో ఎ. శ్రీనివాస్ చేతుల మీదుగా 8 మంది విద్యార్థులకు రూ. 26 వేలు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.